E69 NEWS

తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :331 గురువారం 12 నవంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

కృష్ణా ప్రాజెక్టులపై కేఆర్ఎంబీ కొరడా!



- ప్రాజెక్టుల అసలు వివరాలు సమర్పించాలి
- శ్రీశైలం, సాగర్‌పై ప్రత్యేక దృష్టి
- కొత్త ప్రాజెక్టుల అనుమతులపై ఆరా
- విస్తరణలు, నీటి అవసరాలపై సమీక్ష
- ఆధారాలతో పూర్తి సమాచారం ఇవ్వాలి

2 లో

పదవుల పంచాయితీ.. 69 మంది జాబితా రద్దు!

- కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ
- 69 మందితో జాబితా నిలిపివేత
- అధికార ప్రతినిధుల నియామకంపై రచ్చ
- బీఆర్ఎస్ అనుకూలులకూ పదవులా?
- ఏకపక్ష ఎంపికపై సీనియర్ల అభ్యంతరాలు
- ఏఐసీసీ పరిశీలనలో నియామకాల జాబితా

న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): కాంగ్రెస్ పార్టీలో అధికార ప్రతినిధుల నియామకం రచ్చ లేపింది. జంబో అధికార ప్రతినిధుల నియామకంపై పార్టీలో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైనట్లుగా తెలిసింది. బీఆర్ఎస్?పార్టీకి పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పదవులా? అంటూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జాబితాలో కొందరు కనీస స్థాయిలో విషయ పరిజ్ఞానం లేనివారిని ఎలా నియమిస్తారని, వారు ఏదైనా పొరపాటుగా మాట్లాడితే పార్టీ, ప్రభుత్వం ఇరకాటంలో పడాల్సి వస్తుంది కదా అంటూ పార్టీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. టాలెంట్ హంట్ పేరుతో నిర్వహించిన వారి జాబితా ఏఐసీసీ వద్ద పెండింగ్‌లో ఉండగా ఎలా ప్రకటిస్తారని అభ్యంతరాలు వ్యక్తం కావడంతో చివరికి జాబితాను నిలిపివేశారు. దీనిపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీకి పలువురు ఫిర్యాదులు చేసినట్లుగా తెలిసింది. దీంతో ఆ జాబితాను నిలిపివేయాలని, ఆ జాబితా అమల్లోకి రాదంటూ పార్టీ ప్రకటించింది.

2 లో

మరో అల్పపీడనం.. దక్షిణాదికి వర్ష గండం!

- బంగాళాఖాతంలో మరో అల్పపీడనం
- దక్షిణాది రాష్ట్రాలకు ఐఎండీ హెచ్చరిక
- 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం
- ఏపీకి మూడు రోజుల పాటు వర్షాలు
- తమిళనాడు, కేరళలో భారీ వర్షాలు
- తుఫానుగా మారుతుందా? ఉత్కంఠ

2 లో

- కశ్మీర్‌లో వర్షాలు, హిమపాతం హెచ్చరిక

ఏపీ రాజకీయాల్లో కొత్త అధ్యాయం

- 175 స్థానాల్లో పీఆర్పీ పోటీ
- యువతకు 66 శాతం టికెట్లు
- సామాజిక న్యాయమే పార్టీ లక్ష్యం
- ఆలయ పాలక మండళ్లపై కీలక వ్యాఖ్యలు
- అప్పులపై చంద్రబాబు, జగన్‌కు ప్రశ్నలు
- అవినీతి రహిత రాజకీయాలే ధ్యేయం



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ) అధ్యక్షుడు విజయసాయిరెడ్డి కీలక ప్రకటనలు చేశారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 175 స్థానాల్లోనూ తమ పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తామని, యువతకు 66 శాతం రాజకీయ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. కుల, మతాలకు అతీతంగా యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పేరు, జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన పార్టీ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు.

2029 ఎన్నికల్లో పీఆర్పీ మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుందని విజయసాయిరెడ్డి బలంగా చెప్పారు.

2 లో

పట్టాలు తప్పిన కోల్‌కతా-సైరంగ్ ఎక్స్‌ప్రెస్

- పట్టాలు తప్పిన 7 బోగీలు
- ఉదయం 6.54 గంటలకు ఘటన
- ప్రయాణికులకు స్వల్ప గాయాలు
- ప్రాణనష్టం లేదన్న రైల్వే అధికారులు
- సహాయక చర్యలు ముమ్మరం
- ట్రాక్ పునరుద్ధరణ పనులు షురూ

2 లో

కేదార్‌నాథ్ ఆలయం మూసివేత

6 నెలల ఉఖీమఠ్‌లోనే నిత్య పూజలు

- శీతాకాలం కోసం కేదార్‌నాథ్ మూసివేత
- ఉదయం 8.30 గంటలకు ఆలయ ద్వారాలు బంద్
- ఉఖీమఠ్‌కు బయలుదేరిన ఉత్సవ డోలీ
- ఆరు నెలలు అక్కడే నిత్య పూజలు
- భక్తుల జయజయధ్వానాల మధ్య ముగింపు వేడుకలు
- రంగురంగుల పూలతో ఆలయ అలంకరణ
- చార్‌ధామ్ యాత్రకు భారీగా భక్తులు

2 లో

అప్పులకు ఊరట రుణాలకు బాట!



- రబీకి రూ.38,268 కోట్ల రుణాలు
- పాత అప్పులకు గడువు పొడిగింపు
- 365 మండలాల్లో కరువు సెగ
- రైతులకు రుణ ఊరటపై ఫోకస్
- కౌలు రైతులకూ బ్యాంకు రుణాలు
- 60 నెలల వరకు చెల్లింపు వెసులుబాటు
- తక్కువ నీటి పంటలకు ప్రోత్సాహం
- బ్యాంకుల చుట్టూ తిరగొద్దు..రైతుల వద్దకే బ్యాంకర్లు

న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): ఒకవైపు రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటడం.. మరోవైపు బోరుబావుల్లో నీరు తగ్గిపోవడంతో రబీ సాగు రైతులకు సవాల్‌గా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడి కోసం కొత్త అప్పులు చేయాలా? ఇప్పటికే తీసుకున్న పంట రుణాలు ఎలా చెల్లించాలా? అన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. ఈ రెండు సమస్యలకు ఒకేసారి పరిష్కారం చూపేలా ప్రభుత్వం బ్యాంకర్లపై ఒత్తిడి పెంచుతోంది. పాత పంట రుణాల చెల్లింపుల భారాన్ని తగ్గించడంతోపాటు, రానున్న రబీ సాగుకు కొత్త రుణాలను సకాలంలో అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బ్యాంకులను కోరారు. రైతులు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా బ్యాంకర్లే క్షేత్రస్థాయికి వచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు రూ.38,268 కోట్ల పంట రుణాల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, వాటిని వేగంగా మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2026 సెప్టెంబర్ నాటికి రూ.96,943 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యంలో 53 శాతమే చేరడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

మిగతాది 2 లో..

లోపల దోస్తీ.. బయట కుస్తీ

- ఎమ్మెల్సీ ఎన్నికలతో అధికార, విపక్షాలకు సవాల్
- గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోవాలి
- బీఆర్ఎస్, బీజేపీపై కవిత విమర్శలు
- కాంగ్రెస్‌తో బీఆర్ఎస్‌కు లోపాయికారీ దోస్తీ
- డబ్బుతో గెలవాలనుకుంటున్నారంటూ ఆరోపణ
- బీసీ యువతకు ఎమ్మెల్సీ టికెట్లు
- సామాజిక న్యాయానికి పెద్దపీట



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): అధికార పక్షాన్ని, నిద్రలో ఉన్న ప్రతిపక్షాలను ప్రశ్నించేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఒక మంచి అవకాశమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనలు నిర్వహించి, పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఆశీర్వాదంతో పాటు వీర తిలకం దిద్ది ఆమె అధికారికంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. దగాపడ్డ సమూహాలుగా మనం ఆలోచించుకునే సందర్భం వచ్చిందని, రాష్ట్రంలో ఏదో ఒక డిగ్రీ ఉన్నవారు 80 లక్షల మంది ఉన్నారని, ఇప్పుడు 75 నియోజకవర్గాల్లో (75 శాతం తెలంగాణ) ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు.


పాల ధరలకు రెక్కలు.. లీటర్‌పై రూ.4 పెంపు!



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): నిత్యావసరాల ధరల మోతతో ఇప్పటికే సతమతంఅవుతున్న సామాన్యుడికి మరో షాక్ తగలబోతోంది. ప్రముఖ పాల సరఫరా సంస్థ 'మదర్ డెయిరీ' పాల ధరలను పెంచింది. లీటరుకు రూ.2 నుంచి రూ.4 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ఈ కొత్త ధరలు గురువారం (నవంబర్ 12) నుంచి అమల్లోకి రానున్నాయి. రైతుల నుంచి పాలు సేకరించే ఖర్చులు, ఇతర ముడిసరుకు వ్యయాలు పెరగడం వల్లే ధరలను సవరించాల్సి వచ్చిందని మదర్ డెయిరీ పేర్కొంది.

మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం

- మైనార్టీలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- స్కాలర్‌షిప్‌లపైనా బీజేపీ రాజకీయం
- మైనార్టీ రిజర్వేషన్లపై రేవంత్ ఘాటు వ్యాఖ్యలు
- యువత నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- మైనార్టీల ఓట్ల తొలగింపునకు కుట్ర: సీఎం
- బీఆర్ఎస్‌పై రేవంత్ పరోక్ష సెటైర్లు



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): దేశంలో మైనార్టీలకు ఇచ్చే స్కాలర్‌షిప్స్ కూడా బీజేపీ రాజకీయం చేస్తోందని సీఎం రేంత్ రెడ్డి ప్రశ్నించారు. బంజారా హిల్స్‌లో ఉన్న బంజారా భవన్‌లో జాతీయ విద్యా, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మైనారిటీలకు అన్ని వేళలా, అన్ని రకాలుగా పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో విద్యా, నీటిపారుదల రంగాలకు తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని ఆయన గుర్తుచేశారు.

2 లో

పండుగొస్తే చార్జీల మోత.. హైకోర్టు సీరియస్!



- పండుగ వేళ బస్సు చార్జీల మోత
- ప్రైవేట్ ట్రావెల్స్‌పై హైకోర్టు సీరియస్
- అధిక ఛార్జీల నియంత్రణకు ఆదేశాలు
- ఎనిమిది వారాల్లో నిర్ణయం తీసుకోవాలి
- బస్సుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి
- ప్రయాణికులకు ఊరట లభించేనా?

2 లో

పాల ధరలకు రెక్కలు.. లీటర్‌పై రూ.4 పెంపు!

మొదటి పేజీ తరువాయి

లీటర్ పాలు రూ. 76

ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో అతిపెద్ద పాల సరఫరాదారుగా ఉన్న మదర్ డెయిరీ గతంలో 2026 మే 14న పాల ధరలను పెంచింది. అంతకుముందు 2025 ఏప్రిల్‌లో ధరలను సవరించింది. పాల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో 75 నుంచి 80 శాతం వరకు రైతులకే చెల్లిస్తున్నామని ప్రస్తుతం సేకరణ ధరలు పెరగడంతో ఆ భారంలో కొంత భాగాన్ని వినియోగదారులపై మోపాల్సి వచ్చిందని సంస్థ వర్గాలు తెలిపాయి.

పెరిగిన కొత్త ధరల వివరాలు (ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో):

ఫుల్ క్రీమ్ మిల్క్ (ప్యాకెట్): లీటరు రూ. 72 నుంచి రూ. 76కు పెరిగింది.

ఆవు పాలు: రూ. 62 నుంచి రూ. 65కు చేరింది.

టోన్డ్ మిల్క్ (ప్యాకెట్): రూ. 60 నుంచి రూ. 62కు పెరిగింది.

టోన్డ్ మిల్క్ (బల్క్ వెండెడ్/లూజ్): రూ. 58 నుంచి రూ. 60కి పెరిగింది.

డబుల్ టోన్డ్ మిల్క్: రూ. 54 నుంచి రూ. 56కు చేరింది.

రోజుకు 50 లక్షల లీటర్లు:

మదర్ డెయిరీ దేశవ్యాప్తంగా రోజుకు 50 లక్షల లీటర్లకు పైగా పాలను విక్రయిస్తుండగా, కేవలం ఢిల్లీ-ఎన్సీఆర్ మార్కెట్లోనే రోజుకు సుమారు 35 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తోంది. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ అనుబంధ సంస్థగా 1974లో ప్రారంభమైన మదర్ డెయిరీ.. గత ఆర్థిక సంవత్సరంలో 17 శాతం వృద్ధితో రూ. 20,300 కోట్ల టర్నోవర్‌ను సాధించింది. ఈ సంస్థ 'మదర్ డెయిరీ' బ్రాండ్ పేరుతో పాలు, 'ధార' పేరుతో వంటనూనెలు, 'సఫల్' పేరుతో పండ్లు, కూరగాయలను విక్రయిస్తోంది.

ఏపీ రాజకీయాల్లో కొత్త అధ్యాయం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని, పార్టీ తరపున 66 శాతం టికెట్లు యువతకు కేటాయిస్తామని ప్రకటించారు. కుల, మత భేదాలకు అతీతంగా యువతకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఇక, రాష్ట్రంలోని దేవాలయాల నిర్వహణపై సాయిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆలయాలను ఆదాయ వనరులుగా మార్చుకున్నారని విమర్శించారు. దేవాలయాల పాలక మండళ్లు రాజకీయ నిరుద్యోగులకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయని ఆరోపించారు. దేవుళ్లపై నిజమైన విశ్వాసం, భక్తి ఉన్న వ్యక్తులకు మాత్రమే ఆలయాల పాలక మండళ్లలో అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. లడ్డూలో కల్తీ జరిగిందంటూ చేసిన వ్యాఖ్యలు భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. దేవుళ్లపై భక్తులకున్న నమ్మకం, విశ్వాసాల పట్ల గౌరవం లేకుండా రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా మతపరమైన అంశాలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు.

లక్షల కోట్ల అప్పులు ఎందుకు చేశారు?

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై కూడా విజయసాయిరెడ్డి ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ఆదాయం రూ.2 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్లకు ఎలా చేరిందని ప్రశ్నించారు. చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలు రాష్ట్రంలో ఎలాంటి సంపద సృష్టించాయని, లక్షల కోట్ల రూపాయల అప్పులు ఎందుకు చేశాయని నిలదీశారు. అప్పులు చేయడం మాత్రమే కాకుండా, వాటి ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలిగించారో చెప్పాలని ప్రశ్నించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు రావాలంటే పరివర్తన రాజనీతి పార్టీ అధికారంలోకి రావాలని అన్నారు.

అవినీతి, అక్రమాలకు తావులేని రాజకీయాలే లక్ష్యం

రాష్ట్రంలో స్వచ్ఛమైన రాజకీయ వ్యవస్థను తీసుకురావడమే పీఆర్పీ లక్ష్యమని విజయసాయిరెడ్డి ప్రకటించారు. తమ పార్టీలో అవినీతికి, అక్రమాలకు ఎలాంటి అవకాశం ఉండదని స్పష్టం చేశారు. క్లీన్ పాలిటిక్స్ కోసం పరివర్తన రాజనీతి పార్టీ పనిచేస్తుందని తెలిపారు. యువతకు అవకాశాలు కల్పిస్తూ అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చేలా పార్టీని నిర్మిస్తామని చెప్పారు. కాగా, విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో విజయసాయిరెడ్డి తన కొత్త రాజకీయ పార్టీకి 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ)గా పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. తెలుపు, కాషాయ రంగులతో రూపొందించిన జెండా మధ్యలో ధర్మచక్రం గుర్తును ఏర్పాటు చేశారు. 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని 175 స్థానాల్లో పోటీ చేయడంతో పాటు యువతకు 66 శాతం అవకాశాలు కల్పిస్తామని ప్రకటించడంతో ఏపీ రాజకీయాల్లో పీఆర్పీపై ఆసక్తి నెలకొంది.

పండుగొస్తే చార్జీల మోత.. హైకోర్టు సీరియస్!

న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): పండుగలు, సెలవులు వచ్చాయంటే.. సొంత ఊరు వెళ్లడానికో.. నచ్చిన ప్రదేశాలను చూసేందుకు ప్రయాణాలు పెరుగుతుంటాయి.. అయితే, ఇదే అదునుగా భావించి.. ప్రయాణికుల ముక్కుపిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నాయి ప్రైవేట్ ట్రావెల్స్.. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో పండుగలు, సెలవు రోజుల్లో ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు ఇష్టానుసారంగా టికెట్ ధరలు పెంచడాన్ని నియంత్రించాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై (పిల్) ఏపీ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రైవేట్ బస్సుల ప్రయాణ ఛార్జీల నియంత్రణకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేట్ బస్సు ఆపరేటర్లు వసూలు చేసే గరిష్ట ప్రయాణ ఛార్జీలను నిర్ణయించేందుకు నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని సమర్థంగా అమలు చేయడం లేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సంక్రాంతి, దసరా వంటి పండుగలతో పాటు ఇతర సెలవు రోజుల్లో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ బస్సు యాజమాన్యాలు అధిక ధరలు వసూలు చేస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల అనుమతులు, బస్సులకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర సమాచారాన్ని ఆన్‌లైన్ యాప్‌లలో ప్రయాణికులకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. తద్వారా ప్రయాణికులకు బస్సుల వివరాలు, వాటి అనుమతులపై పారదర్శకత ఉంటుందని పేర్కొన్నారు. ఈ పిల్‌పై విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. పండుగలు, సెలవుల వంటి రద్దీ సమయాల్లో ప్రైవేట్ బస్సుల ప్రయాణ ఛార్జీలను నిర్ణయించే అంశంపై ఎనిమిది వారాల్లోగా తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖను ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఎనిమిది వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. దీంతో పండుగలు, సెలవు రోజుల్లో ప్రైవేట్ బస్సుల అధిక ఛార్జీల వసూళ్లకు అడ్డుకట్ట పడుతుందా అనే ఆసక్తి నెలకొంది. మరి, హైకోర్టు ఆదేశాలపై ఏపీ రవాణాశాఖ ఎలాంటి స్టెప్ తీసుకుంటుందో చూడాలి.

మరో అల్పపీడనం.. దక్షిణాదికి వర్ష గండం!



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో దక్షిణాది రాష్ట్రాలకు ఐఎండీ వర్ష హెచ్చరిక జారీ చేసింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. ఆ అల్పపీడనం 24 గంటల్లో బలపడి వాయవ్య దిశగా కదలనుందని దాని ప్రభావంతో నవంబర్ 14-16 మధ్య కోస్తాంధ్ర, యానాం, రాయలసీమల్లో వర్ష సూచన ఉన్నట్టు అంచనా వేసింది. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, అండమాన్ దీవుల్లో పలురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

తమిళనాడు తీరంలో గంటకు 40 కి.మీ నుండి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. నవంబర్ 12న కశ్మీర్ లోయలో భారీ వర్షాలు, హిమపాతం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే అల్పపీడనం తుఫానుగా మారుతుందా? అనేదానిపై ఐఎండీ ఇంకా ప్రకటన చేయలేదు. ఇక ప్రస్తుతం వర్షాలు తగ్గిపోయి చలికాలం మొదలైంది. దీంతో ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గుతుండగా, వర్షసూచన ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో మళ్లీ వాతావరణంలో మార్పులు వచ్చే అవకాశం ఉంది.

కృష్ణా ప్రాజెక్టులపై కేఆర్ఎంబీ కొరడా!

న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): కృష్ణా జలాల వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి తొలుత ఆమోదించిన అసలు వివరాలను సమర్పించాలని కేఆర్ఎంబీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖల ఈఎన్సీలకు బోర్డు లేఖ రాసింది. ప్రాజెక్టుల అసలు స్వరూపం, ఆ తర్వాత జరిగిన మార్పులు, అదనంగా చేపట్టిన పథకాలు, వాటికి లభించిన అనుమతుల వివరాలను ఆధారాలతో సహా అందించాలని స్పష్టం చేసింది. ప్రధానంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు సంబంధించి మూడు విభాగాల్లో పూర్తి సమాచారం ఇవ్వాలని కోరింది. ప్రాజెక్టుల తొలుత ఆమోదించిన పరిధి, భాగాలు, ఎడమ, కుడి కాలువల ఆఫ్‌టేక్‌లు, వాటి ఆయకట్టు, డిజైన్ డ్రాలు, కమాండ్ ఏరియాలు, నీటి అవసరాలు, సంబంధిత సాంకేతిక నివేదికలు, అనుమతి ఉత్తర్వులు, అసలు ఆమోదించిన సాగునీటి, విద్యుత్, తాగునీటి అవసరాల్లో చేసిన మార్పులు, విస్తరణలు, కొత్తగా చేర్చిన పథకాలు, వాటి డిజైన్, లక్ష్యాలు, అదనపు నీటి అవసరాలు, ఆయా మార్పులు, కొత్త పథకాలకు సంబంధించిన సాంకేతిక అంగీకారాలు, క్లియరెన్సులు, అనుమతుల వివరాలను ఆధారాలతో సమర్పించాలని ఆదేశించింది.

ఆ కేటాయింపులే ప్రామాణికం..

2026 అక్టోబర్ 15న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పంపిన లేఖలో కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపులు, తొలుత ఆమోదించిన ప్రాజెక్టుల వివరాలే ప్రామాణికంగా కానసాగుతున్నాయని పేర్కొన్న విషయాన్ని కేఆర్ఎంబీ తన తాజా లేఖలో ప్రస్తావించింది. ప్రాజెక్టుల పరిధిలో ఆ తర్వాత చోటుచేసుకున్న మార్పులను గుర్తించడానికి, పరిశీలించడానికి అసలు ఆమోదిత వివరాలు అత్యవసరమని స్పష్టం చేసింది. శ్రీశైలం ప్రాజెక్టు పరిధిలో మార్పులు, విస్తరణల అంశం 2026 జనవరి 30న చైర్మన్ అధ్యక్షతన జరిగిన కమిటీ తొలి సమావేశంలో చర్చకు వచ్చినట్లు లేఖలో పేర్కొన్నది. 2021 జులై 15న జారీ చేసిన నోటిఫికేషన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి 11, నాగార్జునసాగర్‌కు సంబంధించి రెండు నాన్-అప్పర్టినెంట్ కాంపోనెంట్లను ప్రస్తావించినట్లు తెలిపింది. అలాగే నాగార్జునసాగర్‌కు సంబంధించిన అంశాలు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నది. కాగా.. 2026 సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 30 వరకు పలు లేఖల ద్వారా రెండు రాష్ట్రాలను అసలు ప్రాజెక్టు వివరాలు కోరినట్లు కేఆర్ఎంబీ గుర్తుచేసింది. అవసరమైన సమాచారం ఇంకా అందలేదని తెలిపింది. ఇదే తరహా వివరాలను నాగార్జునసాగర్‌కు సంబంధించి కూడా కోరినట్లు తెలిపింది. అనుమతి లేని కొత్త ప్రాజెక్టులు, ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల్లో చేసిన మార్పులు, పెరిగిన నీటి అవసరాలపై సమీక్ష నిర్వహించేందుకు అసలు ఆమోదిత ప్రాజెక్టు వివరాలను ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుందని బోర్డు స్పష్టం చేసింది. ఈ సమాచారం రెండు రాష్ట్రాల హక్కులు, అభ్యంతరాలకు భంగం కలిగించకుండా, సంబంధిత న్యాయస్థానాల్లో కొనసాగుతున్న విచారణలకు విఘాతం లేకుండా రికార్డులను పరిశీలించేందుకు అవసరమని పేర్కొన్నది.

పదవుల పంచాయితీ.. 69 మంది జాబితా రద్దు!

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు పీసీసీ తన ఎక్స్‌ఖాతాలో జాబితా నియామకాలను నిలిపివేసినట్లుగా ప్రకటించింది.

బీఆర్ఎస్‌కు పనిచేసే వాళ్లకా..

మరోవైపు జాబితా అంతా ఏకపక్షంగా రూపొందించారని సీనియర్ల నుంచి విమర్శలు వ్యక్తం అయ్యాయి. సోమవారం ప్యానలిస్ట్‌లు, అధికార ప్రతినిధులు, కోఆర్డినేటర్‌లు ఇలా మొత్తం 69 మందితో జాబితాను పార్టీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. జాబితాలో ఉన్న వారితోపాటుగా ఇప్పటికే అధికార ప్రతినిధులుగా ఉన్నవారు సీనియర్ అధికార ప్రతినిధులుగా కొనసాగుతారని ఆయన వెల్లడించారు. దీంతో మొత్తం జాబితా జంబోగా తయారైంది. కొందరు విషయ పరిజ్ఞానం లేనివారిని నియమించడం ద్వారా పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. అలాగే ఒకరిద్దరు బీఆర్ఎస్?నాయకుల సోషల్?మీడియాకు పనిచేస్తున్నారని నేతల దృష్టికి తీసుకువెళ్లినట్లుగా సమాచారం.

టాలెంట్ హంట్ ఏమైంది..

పార్టీకి అధికార ప్రతినిధులుగా నియమితులయ్యే వారు మంచి విషయ పరిజ్ఞానం, ఉండి చురుగ్గా పనిచేసే వారిని నియమంచాలనే ఉద్దేశంతో ఏఐసీసీ టాలెంట్ హంట్ పేరుతో కార్యక్రమాన్ని చేపట్టింది. వీరిని ఎంపిక చేయడానికి ఏఐసీసీ నేతలను, రాష్ట్రం నుంచి కొందరితో కమిటీని ఏర్పాటు చేశారు. దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. చురుగ్గా, సబ్జెక్టు ఉన్న వారిని స్క్రీనింగ్ చేసి ఏఐసీసీకి పంపించారు. జాబితాను ఏఐసీసీ మరోసారి పరిశీలించి ప్రకటించాల్సి ఉంది. ఇది పెండింగ్‌లో ఉండగానే ఇక్కడ జంబో అధికార ప్రతినిధులను ప్రకటించడంపైనా అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే జాబితాను ఏఐసీసీ హోల్డ్‌లో పెట్టాల్సి వచ్చిందని సమాచారం. అలాగే కొందరు సూచించిన వారికే జాబితాలో చోటు ఇచ్చారని, పార్టీకి ఎంతవరకు వారి సేవలు అవసరం, అధికార ప్రతినిధులుగా వారు ఎంతవరకు న్యాయం చేయగలుగుతారనే విషయాన్ని పట్టించుకోకుండా, జాబితాను రూపొందించారని ఫిర్యాదులు వెళ్లినట్లుగా సమాచారం.

కేదార్‌నాథ్ ఆలయం మూసివేత..



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): ఉత్తరాఖండ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు శీతాకాలం కోసం ఇవాళ ఉదయం 8.30 గంటలకు మూతపడ్డాయి. భాయి దూజ్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేద మంత్రోచ్ఛారణలు, సాంప్రదాయ ధార్మిక పూజలు, వేలాది మంది భక్తుల జయజయధ్వనాల నడుమ ఆలయ తలుపులను మూసివేశారు. ఆలయ ద్వారాలు మూసివేసిన అనంతరం, బాబా కేదార్‌నాథ్ పవిత్ర 'చల్ విగ్రహ ఉత్సవ డోలీ' శీతాకాల విడిది కేంద్రమైన ఉఖీమఠ్‌లోని శ్రీ ఓంకారేశ్వర్ ఆలయానికి బయలుదేరింది. శీతాకాలంలో హిమపాతం కారణంగా కేదార్‌నాథ్ వద్ద వాతావరణం అత్యంత శీతలంగా మారుతుంది. దాంతో రాబోయే 6 నెలల పాటు ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర్ దేవాలయంలోనే బాబా కేదార్‌కు నిత్య పూజలు, దర్శనాలు కొనసాగుతాయి. ఆలయ ముగింపు ఉత్సవాల వేళ కేదార్‌నాథ్ ధామ్ ప్రాంగణాన్ని టన్నుల కొద్దీ రంగురంగుల పూలతో ఎంతో సుందరంగా అలంకరించారు. ఈ సంవత్సరం చార్ ధామ్ యాత్రకు రికార్డు స్థాయిలో భక్తులు తరలిరావడం విశేషం.

పట్టాలు తప్పిన కోల్‌కతా-సైరంగ్ ఎక్స్‌ప్రెస్



న్యూస్ డెస్క్, 11 నవంబర్ (తెలుగు గళం): ఉదయాన్నే ఘోర రైలు ప్రమాదం తప్పింది. అస్సాం రాష్ట్రంలోని గౌహతి సమీపంలోని కామరూప్ జిల్లా దిగారు రైల్వే స్టేషన్ వద్ద కోల్‌కతా-సైరాంగ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. ఇంజన్‌తో పాటు రైలుకు చెందిన 6 నుంచి 7 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటన ఉదయం 6.54 గంటల ప్రాంతంలో జరిగినట్లు సమాచారం. అయితే, ప్రమాదం జరిగిన వెంటనే ఈశాన్య సరిహద్దు రైల్వే ఉన్నతాధికారులు, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఇప్పటివరకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే సీపీఆర్‌వో కపింజల్ కిషోర్ శర్మ తెలిపారు. కానీ, పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు, ట్రాక్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

లోపల దోస్తీ.. బయట కుస్తీ

మొదటి పేజీ తరువాయి

గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా తమ ఓటును ఎన్‌రోల్ చేసుకొని ఓటు వేయాలని పిలుపునిచ్చారు. మహిళలు తమ భర్తల వెంటబడి అయినా ఓటు నమోదు చేయించాలని ఆమె కోరారు. గ్రాడ్యుయేట్లు డబ్బులు తీసుకొని ఓట్లు వేస్తారన్న అపవాదు ఉందని, దానిని తొలగించాలని విజ్ఞప్తి చేశారు. చదువుకున్న వారు రాజకీయాల్లోకి వస్తేనే వ్యవస్థ మారుతుందని తాను బలంగా నమ్ముతున్నానని చెప్పారు.

ప్రభుత్వం, ప్రతిపక్షాలపై విమర్శలు

అసెంబ్లీతో పాటు శాసన మండలిలోనూ కాంగ్రెస్ పార్టీయే ఎక్కువగా ఉందని, బీఆర్ఎస్‌లోని సగం మంది కాంగ్రెస్‌లోకి వెళ్లారని కవిత విమర్శించారు. బీజేపీతో వారికి లోపాయికారీ ఒప్పందం ఉందని, మండలిలో అసలు ప్రతిపక్షమే లేకుండా పోయిందని ఆరోపించారు. మూడుసార్లు గెలిపించినప్పటికీ ఏమీ చేయని బీజేపీకి గుణపాఠం చెప్పే అవకాశం వచ్చిందన్నారు.రూ.200 కోట్లు ఖర్చు పెట్టైనా తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అంటే డబ్బు ద్వారానే గెలుస్తామని నమ్ముతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేసిన అన్ని మోసాలను ప్రశ్నించే విధంగా తమ పోరాటం ఉంటుందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, నదీ జలాల వంటి ప్రజా సమస్యలపై తామే పోరాడుతున్నామని పేర్కొన్నారు.

సామాజిక న్యాయం, అభ్యర్థుల ఎంపిక

సామాజిక తెలంగాణ అనే అంశాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించామని కవిత తెలిపారు. తమ ఇద్దరు అభ్యర్థులు బీసీలేనని, వారిలో ఒకరు కాకతీయ విశ్వవిద్యాలయం, మరొకరు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులని చెప్పారు. అభ్యర్థి ఆకాశ్ కొల్లూరి బీసీ కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన వారని, ఇప్పటివరకు ఏ పార్టీ కుమ్మరి వర్గానికి అవకాశం ఇవ్వలేదని అన్నారు. రాజకీయ నేపథ్యం లేని, ధనవంతులు కాని చదువుకున్న యువతకు అవకాశం ఇచ్చామని వివరించారు. హైదరాబాద్ సీటును మహిళకు కేటాయించాల్సి ఉన్నప్పటికీ బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో ఆకాశ్‌కు ఇచ్చామన్నారు. జనరల్ సీట్లలో కూడా రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మహిళలకు 30 నుంచి 50 శాతం సీట్లు ఇస్తామని ప్రకటించారు.

ఎన్నికల సంఘం వద్ద మా పార్టీకి గుర్తింపు:

ఎన్నికల సంఘం వద్ద తమ పార్టీకి గుర్తింపు వచ్చిందని, మిగతా ప్రక్రియకు సంబంధించి తమ న్యాయవాదులు ఈసీతో మాట్లాడుతున్నారని కవిత వెల్లడించారు. భావసారూప్యత కలిగిన అన్ని పార్టీల మద్దతు కోరుతామని, అభ్యర్థులు గెలిచే వరకు పోరాటం చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం..

మొదటి పేజీ తరువాయి

నాడు నెహ్రూ వేసిన బలమైన పునాదుల వల్లే నేడు విద్యా, ఇరిగేషన్ రంగాల్లో దేశం గొప్ప వృద్ధిని సాధించిందన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తొలి విద్యాశాఖ మంత్రిగా నియమించి, దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన యూనివర్సిటీలు, ఐఐటీ లను కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆనాడు పడిన పునాదుల ఫలితంగానే నేడు భారతీయ యువత ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు సీఈవోలుగా ఎదుగుతున్నారని, ఈ విషయాన్ని నేటి యువత గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు.

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం..

ప్రస్తుత కంపెనీల అవసరాలకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాలు పెరగాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యువతలో స్కిల్స్ పెంపొందించేందుకే ఐటీఐ లను ఐటీసీ లుగా మారుస్తున్నామని తెలిపారు. మరిన్ని ఆధునిక వసతులతో రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని కూడా నిర్మిస్తున్నట్లుగా వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెరగడం వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతోందని, అయితే ఏఐ సాంకేతికత ఎంత విస్తరించినా బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఎలాంటి ప్రమాదం ఉండదని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే సచార్ కమిటీ సిఫార్సుల మేరకు మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిందని సీఎం గుర్తుచేశారు. బీజేపీ పాలిత గుజరాత్‌లో కూడా మైనార్టీ రిజర్వేషన్లు అమలుపుతున్నాయని, కానీ తెలంగాణలో మాత్రం వాటిని తొలగిస్తామని బీజేపీ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

మోడీని గద్దె దించడమే కాంగ్రెస్ లక్ష్యం

రాష్ట్రంలో మైనార్టీల ఓటు హక్కును దూరం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. సర్ పేరిట భారీగా మైనార్టీలు, ఎస్టీలు, ఆదివాసీలు, నిరుపేదల ఓట్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. మైనార్టీ విద్యార్థులకు అందే స్కాలర్‌షిప్‌లపై కూడా కాషాయ పార్టీ రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ ఒకటేనంటూ బీఆర్ఎస్ చేస్తోన్న ఆరోపణలను సీఎం తిరస్కరించారు. రాబోయే ఎన్నికల్లో నరేంద్ర మోడీని ఓడించి కేంద్రంలో గద్దె దించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఢిల్లీకి వెళ్లి మోడీ ముందు మోకరిల్లి సాగిలపడింది ఎవరో ప్రజలందరికీ బాగా తెలుసంటూ బీఆర్ఎస్ నేతలపై పరోక్షంగా సెటైర్లు వేశారు.

అప్పులకు ఊరట.. రుణాలకు బాట!

మొదటి పేజీ తరువాయి

మాన్‌సూన్ ఫార్మింగ్ రుణాల లక్ష్యం రూ.1,329 కోట్లు కాగా, కేవలం 17 శాతమే పంపిణీ జరిగిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రబీ రుణాల మంజూరులో జాప్యం జరగకుండా చూడాలని బ్యాంకర్లకు సూచించారు.

చెల్లింపుల గడువు పొడిగించాలి: ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని 365 మండలాలను ప్రభుత్వం కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించింది. వీటిలో 111 తీవ్ర కరువు, 254 మధ్యస్థ కరువు మండలాలున్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో రైతుల రుణ చెల్లింపు సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చరింగ్ చేపట్టాలని ప్రభుత్వం కోరుతోంది. కరువు ప్రభావాన్ని బట్టి మూడేళ్లు లేదా ఐదేళ్ల వరకు రుణ చెల్లింపుల గడువును పొడిగించే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వం సూచించింది. అయితే ఐదేళ్ల వరకు గడువు పొడిగింపు అందరికీ ఒకేలా వర్తించదు. ఆర్‌బీఐ 2017 మార్గదర్శకాల ప్రకారం పంట నష్టం 33-50 శాతం మధ్య ఉంటే ఒక ఏడాది మారటోరియంతో కలిపి గరిష్ఠంగా రెండేళ్లు, 50 శాతం లేదా అంతకంటే ఎక్కువ నష్టం ఉంటే ఒక ఏడాది మారటోరియంతో కలిపి గరిష్ఠంగా ఐదేళ్ల వరకు రుణ చెల్లింపు గడువు పొడిగించవచ్చు. ప్రకృతి విపత్తు సంభవించిన సమయంలోనే బకాయిపడిన స్వల్పకాలిక రుణాలు ఈ రీషెడ్యూలింగ్‌కు అర్హత పొందవు.. అదనపు పూచీకత్తు లేకుండానే అర్హులైన రైతులకు రుణ పునర్వ్యవస్థీకరణ కల్పించాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. రీషెడ్యూలింగ్‌పై ఎస్ఎల్‌బీసీ లేదా జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకున్న తర్వాత రైతులకు కొత్త పంట రుణాలు కూడా మంజూరు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. ఇప్పటికే క్షేత్రస్థాయిలోనూ ఈ ప్రక్రియకు సంబంధించిన చర్యలు మొదలయ్యాయి. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ.1,778 కోట్లకు పైగా వ్యవసాయ రుణాల రీస్ట్రక్చరింగ్‌కు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. తీవ్ర కరువు ప్రభావ

వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించాలి

-కల్లుగీత కార్మిక సంఘం

- భార్యకు ఉద్యోగం కల్పించాలి.. పిల్లల చదువులకు సహకరించాలి..

భూములకు సంబంధించిన కేసులను పరిష్కరించాలి



జనగామ నవంబర్ 11(తెలుగు గళం)

వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జనగామ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి నిన్న విడుదల చేసిన ప్రకటన పూర్తిగా అసంబద్ధంగా ఉందని, తమ భూములకు సంబంధించిన సమస్యలు, జేసీబీ వ్యవహారంపై నమోదైన కేసులు ఇప్పటికీ పరిష్కారం కాలేదని వేముల లక్ష్మణ్ గౌడ్ భార్య, తండ్రి, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేసినట్లు సంఘం నాయకులు తెలిపారు.ఈ సమస్యలతో కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జనగామ జిల్లా బృందం బాధిత కుటుంబాన్ని కలిసి వారి సమస్యలను, ఆవేదనను తెలుసుకుంది.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సహాయం అందించాలని, ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, పిల్లల చదువులకు ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. అలాగే వారి భూములకు సంబంధించిన జేసీబీ సమస్యతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ పరిష్కరించాలని కోరారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని బాధిత కుటుంబ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జనగామ జిల్లా అధ్యక్షుడు బూడిద గోపి, జిల్లా కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేసిన విద్యార్థులు





వరంగల్ నవంబర్ 11(తెలుగు గళం)

ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశం పొందిన వ్యవసాయ విద్యార్థుల కోసం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అర్చన (డీన్--ఆర్గనైజేషన్ అండ్ గ్రోత్), గౌరవ అతిథిగా కనెక్ట్ గ్లోబల్ వ్యవస్థాపకులు, సీఈఓ మనోజ్ బండారి హాజరయ్యారు.ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ జి. భూపాల్ రాజ్ మాట్లాడుతూ,వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, పరిశోధనలపై ఆసక్తి పెంచుకుంటూ ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని సంపాదించాలని సూచించారు.ముఖ్య అతిథి డాక్టర్ అర్చన మాట్లాడుతూ,విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమాచార నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.గౌరవ అతిథి మనోజ్ బండారి మాట్లాడుతూ,మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక ఆలోచనా విధానం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు, వినోద కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.విద్యార్థుల మధ్య స్నేహభావం, ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.


నిస్సహాయులకు న్యాయసాయం అందించడం అందరి బాధ్యత:జడ్జి టి.మహతి వైష్ణవి



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

న్యాయ సేవల దినోత్సవ స్ఫూర్తితో నిస్సహాయులకు న్యాయ సహాయం అందించడం అందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.మహతి వైష్ణవి అన్నారు.జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సీనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, మహిళలు, వయోవృద్ధులు, ఎస్సీ, ఎస్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.అనంతరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల మాట్లాడుతూ.. పారా లీగల్ వాలంటీర్లు, గ్రామ న్యాయ సహాయ కేంద్రాలు, శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా ప్రజలకు న్యాయ సేవలు చేరువవుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్లీడర్ బోట్ల సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, పరిపాలనాధికారి పారిజాతం, సూపరింటెండెంట్ రఘురాం, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పున్నం రవి నియామకం



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేగొండ మండలం రంగయ్యపల్లికి చెందిన ప్రముఖ ఉద్యమ నాయకుడు పున్నం రవి నియమితులయ్యారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాలు,ఎదుర్కొన్న కేసులు, త్యాగాలను గుర్తించి ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్ ఈ బాధ్యతలను అప్పగించారు.ఈ సందర్భంగా పున్నం రవి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలో ఉద్యమకారుల హక్కుల పరిరక్షణకు,వారి సంక్షేమానికి నిరంతరం అండగా ఉంటానని స్పష్టం చేశారు.రవి నియామకం పట్ల పలువురు ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగాల క్రమబద్ధీకరణ పేరుతో రూ.1.80 కోట్ల వసూళ్ల ఆరోపణలు.. గిరిజన సంక్షేమ శాఖలో కలకలం!

- 350 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు తీరని అన్యాయం.. మూడేళ్లయినా నెరవేరని హామీ
- ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేశారంటూ బాధితుల ఆరోపణ
- ఏటూరునాగారం పోలీసులను మరోసారి ఆశ్రయించిన బాధిత ఉద్యోగులు



తెలుగు గళం ఏటూరునాగారం, నవంబర్ 11:

గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగాల క్రమబద్ధీకరణ పేరుతో యూనియన్ నాయకులు భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఉద్యోగాలను క్రమబద్ధీకరించేలా ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని నమ్మబలికి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 మంది ఉద్యోగుల నుంచి రూ.1.80 కోట్ల వరకు వసూలు చేసినట్లు బాధిత ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగాలపై ఆశలు పెట్టుకున్న నిరుపేద ఉద్యోగులు అప్పులు చేసి మరీ డబ్బులు చెల్లించామని, మూడేళ్లు గడుస్తున్నా తమ సమస్య పరిష్కారం కాకపోగా చెల్లించిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రమబద్ధీకరణ హామీతో భారీ వసూళ్లు

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. 2002 నుంచి గిరిజన సంక్షేమ గురుకులాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న భోజనేతర ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని టీజీ టీఆర్ఈఐఎన్‌టీఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బానోత్ కృష్ణసాగర్ ఉద్యోగులకు హామీ ఇచ్చినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో 2023లో హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగుల కేటగిరీల వారీగా ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. అనంతరం కోర్టులో కేసు వేశామని చెబుతూ మరోసారి ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల చొప్పున తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయి సంఘం ప్రతినిధుల ద్వారా ఈ వసూళ్లు జరిగినట్లు బాధితులు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు.

అప్పులు చేసి చెల్లించినా.. ఉద్యోగాలు రెగ్యులర్ కాలేదు!

ఉద్యోగాలు క్రమబద్ధీకరణ అవుతాయన్న ఆశతో కొందరు అప్పులు చేయగా, మరికొందరు బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి, భూములు అమ్మి మరీ డబ్బులు చెల్లించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 మంది ఉద్యోగుల నుంచి రూ.1.80 కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. మూడేళ్లు గడిచినా ఉద్యోగాలు క్రమబద్ధీకరణ కాకపోవడంతోపాటు చెల్లించిన డబ్బులు కూడా తిరిగి అందకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.

ఏటూరునాగారం పరిధిలో 15 మంది బాధితులు

ములుగు జిల్లా ఏటూరునాగారం పరిధిలోని మూడు గురుకులాలకు చెందిన సుమారు 15 మంది కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగులు ఈ వ్యవహారంలో బాధితులుగా ఉన్నట్లు వెల్లడించారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు సంబంధిత సంఘం నాయకులను కోరినా సరైన స్పందన రాలేదని తెలిపారు. మొదట గడువులు పెడుతూ కాలయాపన చేశారని, చివరకు డబ్బులు అడిగితే ఇవ్వడం కుదరదని చెప్పినట్లు బాధితుడు వట్టం జగ్గ ఆరోపించారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడంతోపాటు తమను భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. ఉద్యోగం పోతుందనే భయంతో ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నామని, చివరకు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు.

ఐదు నెలల క్రితమే పోలీసులకు ఫిర్యాదు.. డీజీపీకి వినతి

ఈ వ్యవహారంపై బాధిత ఉద్యోగులు ఐదు నెలల క్రితమే ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాష్ట్ర డీజీపీకి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు సైతం వినతిపత్రాలు సమర్పించారు. 2026 మే 28న ఎమ్మెల్సీకి అందజేసిన వినతిపత్రంలో డబ్బుల వసూళ్ల, సంఘం నాయకుల పాత్ర, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో బుధవారం మరోసారి ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రఘును పిలిపించి చర్చించినట్లు బాధితుడు వట్టం జగ్గ వెల్లడించారు.

వసూలైన సొమ్ము ఎక్కడికి వెళ్లింది? బాధితులకు న్యాయం ఎప్పుడు?

ఉద్యోగాలను క్రమబద్ధీకరించే అధికారం ప్రభుత్వానికి, సంబంధిత శాఖకు మాత్రమే ఉన్నప్పటికీ అలాంటి హామీలతో ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సుమారు 350 మంది ఉద్యోగుల నుంచి వసూలు చేసినట్లు చెబుతున్న రూ.1.80 కోట్లు ఎక్కడికి వెళ్లాయి? ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉంది? బాధితులకు డబ్బులు తిరిగి చెల్లించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని ఉద్యోగులు కోరుతున్నారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ పేరుతో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని బాధిత కాంట్రాక్టు ఉద్యోగులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుడుంబా తయారీదారులపై వెంకటాపురం పోలీసుల ఉక్కుపాదం.. 21,800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం!

- అటవీ ప్రాంతాల్లో పోలీసుల మెరుపు దాడులు.. 102 లీటర్ల గుడుంబా స్వాధీనం!
- గుడుంబా మాఫియాకు పోలీసుల చెక్.. వారం రోజుల్లో 35,900 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం!
- అక్రమ గుడుంబా స్థావరాలపై వేట.. 22 మందిపై కేసులు నమోదు!
- గుడుంబా రహిత ఏజెన్సీ లక్ష్యంగా పోలీసుల ప్రత్యేక దాడులు.. అక్రమ తయారీదారుల్లో గుబులు!



తెలుగు గళం వెంకటాపురం(నూగూర్), నవంబర్ 11:

ములుగు జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఏటూరునాగారం అదనపు పోలీసు అధికారి పర్యవేక్షణలో వెంకటాపురం పోలీసుల ఆధ్వర్యంలో అక్రమ గుడుంబా తయారీ స్థావరాలపై ప్రత్యేక దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ అటవీ ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలను ధ్వంసం చేశారు. ఆలుబాక గ్రామపంచాయతీ పరిధిలోని ముత్తారం గ్రామ శివారులో 25 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 5,000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే బోదాపురం గ్రామపంచాయతీ పరిధిలోని సీతారాంపురం గ్రామ శివారులో 52 డ్రమ్ముల్లో ఉన్న 10,800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. బోదాపురం గ్రామ శివారులో మరో 28 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 6,000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 32 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో మొత్తం 105 డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 21,800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు 102 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీలో పాల్గొన్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు.


వారం రోజుల్లో భారీ స్థాయిలో దాడులు..

గత వారం రోజులుగా వెంకటాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో పోలీసులు వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో భాగంగా ఇప్పటివరకు మొత్తం 35,900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 182 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ గుడుంబా తయారీకి పాల్పడిన మొత్తం 22 మందిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ దాడుల్లో వెంకటాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రమేష్, ఎస్ఐలు కె. తిరుపతిరావు, తిరుపతిరెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆలుబాక కేంద్ర రిజర్వు పోలీసు బలగాల సిబ్బంది పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే అక్రమ గుడుంబా తయారీ, నిల్వ, విక్రయాలు, రవాణాపై నిరంతర నిఘా కొనసాగిస్తామని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెంకటాపురం పోలీసులు హెచ్చరించారు.

హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నా.. పల్లెటూరి బడి పిల్లలపై చెరగని అభిమానం!

- విద్యార్థుల అవసరాన్ని గుర్తించి వాటర్ డిస్పెన్సర్ బహూకరణ.. మనీషా, నాని సేవాభావానికి అభినందనలు






తెలుగు గళం వెంకటాపురం(నూగూర్), నవంబర్ 11:

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలనే సందేశాన్ని చాటుతూ ఇద్దరు దాతలు మంచి మనసును చాటుకున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామానికి చెందిన మనీషా, నాని (నాగభూషణం) ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా మరికాల కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కాపుల విజయ్ విద్యార్థుల అభ్యున్నతి కోసం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చేస్తున్న కృషి, పాఠశాల అభివృద్ధి కోసం తీసుకుంటున్న ప్రత్యేక చొరవను చూసి వారు ఎంతో స్ఫూర్తి పొందారు. ఈ క్రమంలో పాఠశాల విద్యార్థులకు తమ వంతుగా ఏదైనా సహాయం చేయాలనే ఆలోచనతో ముందుకొచ్చి, విద్యార్థులకు నిత్యం ఉపయోగపడే వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించారు. వీరి సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ప్రత్యక్ష పరిచయం లేకపోయినా సోషల్ మీడియా ద్వారా ఒక ప్రభుత్వ పాఠశాలతో అనుబంధం ఏర్పరచుకొని, విద్యార్థుల అవసరాలను గుర్తించి సహాయం అందించడం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ, తమ ప్రాంతంలోని పల్లెటూరి బడి పిల్లల అవసరాలపై స్పందించి సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కాపుల విజయ్ మనీషా, నాని (నాగభూషణం) గార్లకు విద్యార్థుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయుల కృషితో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

శిథిల ఆలయ స్థానంలో నూతన ఆలయం

అన్నారం షరీఫ్ లో భక్తిశ్రద్ధలతో హనుమాన్ ఆలయ శంకుస్థాపన



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/నవంబర్ 11

వరంగల్ జిల్లా :పర్వతగిరి: అన్నారం షరీఫ్ గ్రామంలో ఆంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని పురాతన ఆంజనేయ స్వామి ఆలయం గోడలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాత ఆలయాన్ని తొలగించి, అదే స్థానంలో నూతన ఆలయ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆలయ నిర్మాణానికి పూజా కార్యక్రమాలు, శంకుస్థాపనతో పాటు స్వామివారి ఉద్వాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ హాజరయ్యారు.ఉప సర్పంచ్ గొడుగు ఏకాంత సారయ్య పాల్గొన్నారు. గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు రామకృష్ణ,రాపోలు అనిత రవీందర్,నాగరాజు,పస్తం రాధిక, సుధాకర్,జలంధర్, కొండేటి కొమరమ్మ, రామచందర్,దొంతమాల పవన్ కళ్యాణ్,గాడిపెల్లి రాజబాబు,సుర మంగమ్మ, సాయమలు పాల్గొన్నారు.గ్రామ ప్రముఖులు సారంగపాణి,బిక్షపతి, సాంబయ్య, బాబు మదన్మోహన్,లక్ష్మణ్, గొల్లపల్లి మహేందర్,బుర్ర మహేందర్,గొల్లపల్లి సంతోష్,జడల కృష్ణతో పాటు మహిళలు, యువజన సంఘాల సభ్యులు,కుల సంఘాల అధ్యక్షులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఉప సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

తెలుగు గళం న్యూస్
మహబూబాబాద్ జిల్లా.



తొర్రూర్ మండలంలోని మాటేడు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,మాటేడు గ్రామ ఉప సర్పంచ్ దీకొండ సుధాకర్ గౌడ్,కానిస్టేబుల్ సోమయ్య తండ్రి కీ"శే" దీకొండ సాయిలు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన తెలంగాణ రాష్ట్ర మాజీ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,వారి వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్వీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మామిడి శ్రీకాంత్

నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి



తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్వీ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా మామిడి శ్రీకాంత్ నియమితులయ్యారు.జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ సిఫార్సు మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్వయంగా శ్రీకాంత్‌కు నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.తన పుట్టినరోజు నాడే ఈ కీలక బాధ్యత దక్కడం పట్ల శ్రీకాంత్ సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ..జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజకీయ ఎదుగుదలకు, హక్కుల సాధనకు యువత క్రియాశీలకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.అనంతరం నూతన అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన తీన్మార్ మల్లన్న, రవి పటేల్‌కు ధన్యవాదాలు తెలిపారు.గ్రామ స్థాయి నుంచి యువతను ఏకం చేసి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అండగా ఉంటానని స్పష్టం చేశారు.

బుగులోని జాతర ఏర్పాట్లు,భద్రతను పరిశీలించిన అదనపు కలెక్టర్,అధికారులు






తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో వెలసిన శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర ఏర్పాట్లను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ముందుగా ఆమె కొండపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ కింద ఉన్న శివాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు నిరంతర విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు కల్పించాలని,అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని ఆమె ఆదేశించారు.అలాగే జాతర పరిసరాలు, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన అధికారులు భద్రతా బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బందోబస్తు పాయింట్లతో పాటు కార్లు,ద్విచక్ర వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను గుర్తించారు.ఈ కార్యక్రమంలో రేగొండ ఎస్సై డి.సుధాకర్, కొత్తపల్లి గోరి ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి ,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఎంపీడీవో, జాతర కమిటీ చైర్మన్ గంగుల రమణారెడ్డి, సర్పంచ్ చల్లగురుగుల సుదర్శన్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, ఈవో బిళ్ళ శ్రీనివాస్, జాతర కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కడారి గూడెంలో ఎమ్ ఎస్ ఎఫ్ గ్రామ నూతన కమిటీ ఎన్నిక

తెలుగు గళం న్యూస్
వర్ధన్నపేట/నవంబర్ 11



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కడారి గూడెం గ్రామంలో మాదిగ విద్యార్థి సమాఖ్య గ్రామ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మండల ఎంఆర్పీఎస్ ఉపాధ్యక్షులు సిలివేరు రాజు మాదిగ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథులుగా వర్ధన్నపేట మండల ఎంఎస్పీ అధ్యక్షులు ముత్యాల మల్లేశం మాదిగ మరియు వర్ధన్నపేట మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షులు చాడ కర్ణాకర్ మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి మాదిగ విద్యార్థి చేతిలో ఎంఎస్ఎఫ్ జెండా ఉండాలని,ప్రతి మాదిగ విద్యార్థి సామాజిక చైతన్యాన్ని అలవర్చుకోవాలని అన్నారు. మన హక్కుల కోసం,విద్య అభివృద్ధి కోసం,మన సమాజ భవిష్యత్తు కోసం ప్రతి విద్యార్థి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఎంఆర్పీఎస్ సాధించిపెట్టిన ఎస్సీ వర్గీకరణ ఫలాలను సంపూర్ణంగా ఉపయోగించుకొని విజ్ఞానం, వివేకం, వికాసంలో మరింత శక్తిమంతులుగా ముందుకు సాగాలని తెలిపారు. గ్రామ నూతన కమిటీ అధ్యక్షులు:కంజర్ల కృష్ణస్వామి మాదిగ అధికార ప్రతినిధి:హర్షవర్ధన్ మాదిగ ఉపాధ్యక్షులు:కంజర్ల తరుణ్ మాదిగ,కార్యవర్గ సభ్యులు కంజర్ల మహేష్ మాదిగ,గాదే నితిన్ మాదిగ,గాదే మహేందర్ మాదిగ,కంజర్ల సుధాకర్ మాదిగ,చెన్న బబ్బులు మాదిగ,చెన్న మధుకర్ మాదిగ,చెన్న ఎల్లయ్య మాదిగ,ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏజెన్సీ విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాలి -- నాణ్యమైన విద్య అందించాలి!

గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి -- పూనెం నితిన్ దొర

బినామీ ఉపాధ్యాయులకు చెక్ పెట్టాలి..

ఏకోపాధ్యాయ పాఠశాలలను బలోపేతం చేయాలి!

తెలుగు గళం వెంకటాపురం(నూగూర్), నవంబర్ 09:



ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యావ్యవస్థ రోజురోజుకూ బలహీనపడుతూ, విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని గొండ్వానా విద్యార్థి సంక్షేమ పరిషత్ నాయకుడు పూనెం నితిన్ దొర ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటాపురం మండలం చొక్కాల గ్రామంలో ఆదివాసీలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, బినామీ వ్యక్తులతో పాఠశాలలు నిర్వహించే విధానానికి అడ్డుకట్ట వేయాలని కోరారు. విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులను నియమించి, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండల విద్యాధికారులు పాఠశాలలను తరచూ ఆకస్మికంగా తనిఖీ చేసి సమస్యలను పరిష్కరించాలని, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా స్థానిక యంత్రాంగం బాధ్యతగా వ్యవహరించాలని పూనెం నితిన్ దొర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సబక సత్యనారాయణ, సబక శేఖర్, అట్టం సాయిబాబు, కోడం కళ్యాణ్, పాయం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

- **మౌలానా ఆజాద్ ఆశయాలే విద్యార్థులకు స్ఫూర్తి -- ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ వెంకటయ్య**

తెలుగు గళం ఏటూరునాగారం, నవంబర్ 11:





ఏటూరునాగారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతరత్న, స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ సీహెచ్. వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ, స్వతంత్ర భారతదేశంలో విద్యా వ్యవస్థకు పటిష్టమైన పునాదులు వేయడంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి, సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. విద్యా రంగ అభివృద్ధికి ఆయన చేసిన కృషి భావితరాలకు మార్గదర్శకమని కొనియాడారు. విద్య ద్వారానే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ వికాసం, దేశ ప్రగతి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. దేశ విద్యా విధానం, విద్యారంగ అభివృద్ధికి మౌలానా ఆజాద్ చేసిన సేవలు, ఆయన ఆశయాలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కలిసి కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు కళాశాల ఆవరణలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి. జ్యోతి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ కనీస్ ఫాతిమా, అధ్యాపకులు జీవవేణి, సంపత్, శ్రీధర్, రమేష్, భాస్కర్, శేఖర్, భావన, శ్రీకాంత్, ప్రశాంతి, సుమలత, బోధనేతర సిబ్బంది, జాతీయ సేవా పథకం స్వచ్ఛంద సేవకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

శివునిపల్లిలో వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎంఆర్పీఎస్ నాయకులు

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్పూర్/నవంబర్ 11



జనగామ జిల్లా:స్టేషన్ ఘన్ పూర్ మండలం శివునిపల్లి గ్రామంలో కేఆర్ గార్డెన్ లో జరిగిన వివాహ వేడుకల్లో ఎంఆర్పీఎస్ వర్ధన్నపేట మండల నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మహబూబ్ నగర్ గ్రామానికి చెందిన బరిగల సుజాత భాస్కర్ దంపతుల ఏకైక పుత్రిక శృతి,వంశీ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల ఎంఎస్పీ అధ్యక్షులు ముత్యాల మల్లేశం మాదిగ, వర్ధన్నపేట మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షులు చాడ కర్ణాకర్ మాదిగ, వర్ధన్నపేట మండల ఎంఎస్పీ అధికార ప్రతినిధి బిర్ర బిక్షపతి మాదిగ,సింగపురం బాబు తదితరులు పాల్గొన్నారు.నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని నాయకులు ఆకాంక్షించారు.

ఉప్పరపల్లిలో ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

తెలుగు గళం న్యూస్
వర్ధన్నపేట/నవంబర్ 11



వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో మాదిగ విద్యార్థి సమాఖ్య నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఎంఎస్ఎఫ్ జెండాలతో,నినాదాలతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ప్రతి మాదిగ విద్యార్థి చేతిలో ఎంఎస్ఎఫ్ జెండా ఉండాలని,విద్యార్థులు సామాజిక చైతన్యంతో,విజ్ఞానంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మన హక్కుల కోసం,విద్య అభివృద్ధి కోసం, సమాజ భవిష్యత్తు కోసం ప్రతి విద్యార్థి ముందుకు రావాలని కోరారు.ఎంఆర్పీఎస్ సాధించిపెట్టిన ఎస్సీ వర్గీకరణ ఫలాలను సంపూర్ణంగా ఉపయోగించుకొని విజ్ఞానం,వివేకం,వికాసంలో మరింత శక్తిమంతులుగా ఎదగాలని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామస్తులకు, యువతకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఏటూరునాగారంలో కోర్టు సాధించుకోవడం మనందరి హక్కు

-- ఐక్యంగా ఉద్యమిద్దాం : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు

ఆరు మండలాల్లో 1,350కి పైగా కేసులు..

ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి

కోర్టు సాధన కోసం అఖిలపక్షం ఐక్య పోరాటం చేయాలి -- తొలి తీర్మానం చేసే బాధ్యత మాదే : సర్పంచ్ కాకులమర్రి శ్రీలత

తెలుగు గళం ఏటూరునాగారం, నవంబర్ 09 :







ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటు చేసుకోవడం ఈ ప్రాంత ప్రజల హక్కు అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, గ్రామ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం, వాజేడు, తాడ్వాయి, కన్నాయిగూడెం ఆరు మండలాల పరిధిలో సుమారు 1,350కి పైగా కేసులు ఉన్నాయని, కోర్టు ఏర్పాటుకు అవసరమైన అర్హతలు ఉన్నాయని తెలిపారు. కోర్టు ఏర్పాటు వల్ల మారుమూల ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు అందుబాటులోకి రావడంతో పాటు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి కోర్టు సాధించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, న్యాయవాదులు, ప్రజలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఏటూరునాగారం గ్రామపంచాయతీ తరఫున తొలి తీర్మానం అందించే బాధ్యత తాము తీసుకుంటామని సర్పంచ్ శ్రీలత తెలిపారు. ఈ సమావేశంలో తాలూకా కోర్టు సాధన సమితి అధ్యక్షుడు ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు కర్నె ప్రణయ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సున్నం రమేష్, కోశాధికారి నాగలత, జాయింట్ సెక్రటరీ పూర్ణచందర్‌రావు, ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు తదితరులు పాల్గొన్నారు.

కోటి రూపాయలతో విద్యుత్ ఉపకేంద్రం మంజూరు

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సన్మానం కృతజ్ఞతలు తెలియజేసిన నల్లబెల్లి సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్

తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట /నవంబర్ 11



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామ ప్రజల విద్యుత్ సమస్యల పరిష్కారం,మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా నల్లబెల్లి గ్రామానికి సుమారు కోటి రూపాయల నిధులతో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా నల్లబెల్లి గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గ్రామానికి అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి సహకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు,వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజుకు గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు వల్ల గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నల్లబెల్లి గ్రామంలో నిర్మించే విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభోత్సవానికి స్వయంగా విచ్చేసి ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను జక్కి శ్రీకాంత్ సాదరంగా ఆహ్వానించారు. గ్రామ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని వినతి పత్రం సమర్పించారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.